క్లుప్తంగా

కేజీబీవీ ఆకస్మిక తనిఖీ



అనుమసముద్రంపేట: స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలను జేసీడీఓ టీ మమత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గది, మరుగుదొడ్లు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్మీడియట్, పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట ప్రిన్సిపల్ లక్ష్మి, ఉపాధ్యాయులు ఉన్నారు.

పత్తి పంట పరిశీలన



అనుమసముద్రంపేట: జమ్మవరం, ఏఎస్‌పేట, చిరమన గ్రామాల్లో సాగుచేసిన పత్తి పంటను జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సురేఖాదేవి గురువారం పరిశీలించారు. పత్తి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. పంట శాఖీయ, పూత, కాయ దశల్లో ఉందని తెలిపారు. పంటలో మెగ్నీషియంలోపం ఉన్నట్లు గుర్తించి నివారణకు లీటరు నీటికి 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపి 45 నుంచి 70 రోజులకు ఒకసారి పిచికారీ చేయాలని సూచించారు. పండాకు తెగులు నత్రజని, పొటాషియం, భాస్వరం లోపం, రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు పెరిగినా సోకుతోందని తెలిపారు. రైతులు తగిన జాగ్రత్తలు పాటిస్తే మంచిదిగుబడులు వచ్చి ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. ఆమె వెంట ఏఓ రజని, ఏఈఓ చిరంజీవి పాల్గొన్నారు.

పాఠశాలలకు అగ్నిమాపక పరికరాలు



సీతారామపురం: మండలంలో నాడు–నేడు కింద పనులు చేపట్టిన 9 పాఠశాలలకు అగ్నిమాపక పరికరాలను గురువారం పంపిణీ చేసినట్లు ఎంఈఓ మస్తాన్‌వలి తెలిపారు. పాఠశాలల్లోని గోడలకు అగ్నిమాపక పరికరాలను అమర్చాలని ఉపాధ్యాయులకు సూచించారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



మర్రిపాడు: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలోని పదో తరగతి విద్యార్థినులకు గురువారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. గ్రంథాలయాధికారి నారాయణరావు తన కుమారుడి జ్ఞాపకార్థంగా పరీక్ష సామగ్రి వితరణ చేశారు. ఈ సందర్భంగా జీసీడీఓ మమత మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కేజీబీవీ ప్రిన్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు



సంగం: అన్నారెడ్డి పాళెం పడమటి దళితవాడలోని నక్కా వెంకటశేషమ్మ ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గురువారం మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో గృహోపకరణాలు కాలిపోవడంతో సుమారు రూ.లక్షకుపైగా ఆస్తినష్టం సంభవించినట్లు బాధితురాలు వాపోయింది.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం



దగదర్తి: అమరజీవికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ



కావలి: ఎమ్మెల్యే కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కావలి: తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం నిరాహారదీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కార్యాలయంలో అమరజీవి చిత్ర పటానికి వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం పూలమాలలు వేసిన ఘనంగా నివాళులర్పించారు. నాయకులు కనమర్లపూడి వెంకటనారాయణ, డాక్టర్ శ్రీరాం మనోహర్, తిరువీధి ప్రసాద్, అమరా వేదగిరి, కుందుర్తి శ్రీనివాసులు, చీదెళ్ల కిషోర్, మండలి కృష్ణారావు, ఏఎస్‌సీసీ కృష్ణారెడ్డి పుత్తూరు నాగాచారి, కలవకూరు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు: మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీరామకృష్ణ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శశిరేఖ, ఎంపీడీఓ శ్రీదేవి, నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ ఫణికుమార్ అమరజీవికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొట్టిశ్రీరాములు త్యాగాన్ని స్మరించుకున్నారు. హౌసింగ్ ఏఈ జమీల్, డీటీ చెంచయ్య, ఆర్‌ఐ సుధీర్,ఏఓ మస్తాన్,తదితరులు పాల్గొన్నారు.

దగదర్తిలో...

దగదర్తిలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు

ఆత్మకూరు: తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని పలువురు వక్తలు కొనియాడారు. పొట్టి శ్రీరాములు జయంతిని ఆత్మకూరులోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు.

- ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో ఇన్‌చార్జి ఆర్డీఓ పద్మావతి అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్ కార్యాలయ సిబ్బంది, మెప్మా సిబ్బందితో కలిసి అమరజీవికి నివాళులర్పించారు. మున్సిపల్ ఆర్‌ఐ ఖాసీం, మెప్మా సీఓ మాధవి, సంక్షేమ కార్యదర్శి ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.
- మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఎంవీఐ రాములు ఆధ్వర్యంలో అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సత్రంసెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘ నాయకులు చిన్ని సుధీర్, హజరత్తయ్య, సురేష్‌బాబు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అమరజీవికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి ఆత్మ గౌరవాన్ని కాపాడేందుకు ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసి తెలుగువారి ఐక్యతకు పాటుపడిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఈఓపీఆర్డీ ఉషారాణి, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, సాంకేతిక సహాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో అమరజీవి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఏఎస్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం హమీద్ అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమశిల: అనంతసాగరం మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ టీ ప్రదీప్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ మంజుల ఆధ్వర్యంలో అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పెయ్యల ఈశ్వరయ్య, ఈఓపీఆర్డీ ప్రసాద్, శశికళాధరశర్మ, చంద్రమౌళిశర్మ, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంగం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘ నాయకుడు అనుమాలశెట్టి రామారావు ఆధ్వర్యంలో అమరజీవి జయంతిని ఘనంగా నిర్వహించారు. సంగం సీఐ రవినాయక్, ఎస్సై నాగార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కంటాబత్తిన రఘునాథరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు రాంబాబు, రవీంద్రబాబు, గోపి, గుప్తా, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

- మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు గిరిబాబు, రాజా, వేమా మల్లికార్జునరావు, శ్రీధర్, శ్రీరాం, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయంలో అమరజీవి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ విజయలలిత అమరజీవి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో అమరజీవి చిత్రపటానికి అసోసియేట్ డీన్ డాక్టర్ జీ కరుణసాగర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల కార్యనిర్వహణాధికారి డాక్టర్ గోపీకృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మకూరు: ఆర్డీఓ కార్యాలయంలో..



ఆత్మకూరు: మున్సిపల్ కార్యాలయంలో..



ఆత్మకూరు: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..



ఆత్మకూరురూరల్: మండల పరిషత్ కార్యాలయంలో..



చేజర్ల: మండల పరిషత్ కార్యాలయంలో..



ఉదయగిరి: ఎంజీఆర్ వ్యవసాయ కళాశాలలో..



అల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో..



అనంతసాగరం తహసీల్దార్ కార్యాలయంలో..



ఏఎస్‌పేటలో..



సంగం: పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అనుమసముద్రంపేట: మండలంలోని నక్కల వాగు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. వివరాలు.. హసనాపురం నుంచి ఏఎస్‌పేటకు వస్తున్న ఆటో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. ఆటోలోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఏఎస్సై మాల్యాద్రి క్షతగాత్రులను 108 వాహనంలో ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు.

ఇంటి పన్నులు చెల్లించాలి

అల్లూరు: నగర పంచాయతీ ప్రజలు ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ఫణికుమార్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నుల బకాయలను నెలాఖరులోగా చెల్లించాలని కోరారు. పన్నులు చెల్లించని వారిపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

దంత పరీక్షలు



దుత్తలూరు: స్థానిక అనాథ పిల్లల శరణాలయాన్ని దుత్తలూరు పీహెచ్‌సీ వైద్యసిబ్బంది గురువారం సందర్శించారు. చిన్నారులకు డాక్టర్ సుమిత్ర దంత పరీక్షలు నిర్వహించి దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. హెల్త్‌సూపర్‌వైజర్ జగన్‌మోహన్‌రావు, ఆరోగ్య కార్యకర్తలు నారాయణ, మాధవి పాల్గొన్నారు.

సర్వేలు పూర్తిచేయాలి

ఉదయగిరి: సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రభుత్వం నిర్దేశించిన ఆయుష్మాన్ భారత్, ఎస్‌డీజీ సర్వేలను సకాలంలో పూర్తిచేయాలని ఎంపీడీఓ బిజాక్‌ప్రవీణ్ అన్నారు. మండలంలోని తిరుమలాపురం గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. నెలాఖరులోగా నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని సూచించారు. పంచాయతీల విద్యుత్ చార్జీలను సీఎఫ్‌ఎంఎస్ ద్వారా బిల్లులు జనరేట్ చేసి చెల్లింపులు చేయాలన్నారు. ఈఓపీఆర్డీ మల్లికార్జునరావు, కార్యదర్శి అవుల వెంకట్రామయ్య, మండల కోఆర్డినేటర్ గాజుల ఇమ్రాన్ పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో ఈక్రాప్ రైతుల జాబితా

చేజర్ల: రబీ సీజన్‌కు సంబంధించి ఈక్రాప్ నమోదు చేసుకున్న రైతుల జాబితాను ఆర్‌బీకేల్లో ప్రదర్శించినట్లు ఏఓ శిరీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈక్రాప్ జాబితాపై రైతులకు ఏమైనా అభ్యంతాలు ఉంటే శుక్రవారంలోగా ఆర్‌బీకేల్లోని వీఏఏలకు తెలియజేయాలని కోరారు.

పోలీసులు న్యాయం చేయాలి



న్యాయం చేయాలని వేడుకుంటున్న సాంబశివారెడ్డి దంపతులు

జలదంకి: గ్రామానికి చెందిన కొందరు తమపై దాడి చేయడమే కాకుండా అక్రమంగా కేసు పెట్టారని కృష్ణాపాడుకు చెందిన వృద్ధ దంపతులు వేలమూరి సాంబశివారెడ్డి, అరుణావతి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వారు విలేకరులకు తమ గోడు వెల్లబోసుకున్నారు. గ్రామానికి చెందిన ద్రోణాదుల మహేష్, అతని స్నేహితులు మద్యం సేవించి ట్రాక్టర్లు వెళ్లే దారిలో బాటిళ్లు పడేస్తున్నారని సాంబశివారెడ్డి ఆరోపించారు. తమ ట్రాక్టర్ వెళ్లేందుకు బాటిళ్లను ఏరి దారిపక్కన కుప్పగా పోశామని చెప్పారు. దీంతో మహేష్ తన ఇంటి గోడ కింద బాటిళ్లను కుప్పగా పోస్తారా అంటూ కోపోద్రిక్తుడై ఈ నెల 10న తన బంధువులైన వాకా కొండారెడ్డి, వాకా మనోహర్, వాకా సుశీల, వాకా విజయలక్ష్మితో కలిసి తమ ఇంటి వద్దకొచ్చి కర్రలతో తమపై దాడికి పాల్పడ్డారని వాపోయారు. ఈ దాడిలో తనకు గాయాలు కావడంతో జలదంకి పోలీసుస్టేషన్‌కు వెళ్లగా కావలి ఏరియా వైద్యశాలకు వెళ్లాలని సూచించారని చెప్పారు. తాను కావలిలో ఉన్న సమయంలో తన భార్య అరుణావతిపైన దాడి చేయగా, ఆమెను కావలి వైద్యశాలకు తరలించారని, అక్కడ తమను ఎవరూ పట్టించుకోలేదన్నారు. తమపై దాడికి పాల్పడిన వారి బంధువు ఆస్పత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తున్న కరేటి వెంకటలక్ష్మి ఇక్కడకు ఎందుకొచ్చారంటూ దురుసుగా ప్రవర్తిందన్నారు. దీంతో తాము చికిత్స కోసం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చేరామన్నారు. నెల్లూరు వైద్యశాలలో పోలీసులు తమ వివరాలు నమోదు చేసుకున్నారని తెలిపారు. అయితే తమపై దాడికి పాల్పడిన వారు కావలి ఏరియా వైద్యశాలలో చేరి తాము దాడికి పాల్పడినట్లు నర్సు కరేటి వెంకటలక్ష్మి సాయంతో కేసు నమోదు చేయించారని ఆరోపించారు. పోలీసులు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కావలి రూరల్: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని రాజువారిచింతలపాళెం సర్పంచ్ పీ రాజేంద్ర పేర్కొన్నారు. మండలంలోని రాజువారిచింతలపాళెంలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. పొలాల్లో నవధాన్యాలు చల్లుకుని భూసారం పెంచుకోవడం ద్వారా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. తెగుళ్ల నివారణకు రసాయన మందులకు బదులుగా కషాయాలను వినియోగించడం ద్వారా పంట దిగుబడులు పెరుగుతాయన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన పంటలకు మార్కెట్లో డిమాండ్ ఎక్కువగా ఉంటుందన్నారు. టీటీడీ దేవస్థానం నేరుగా కొనుగోలు చేస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ మాలకొండయ్య, పాఠశాల హెచ్‌ఎం జగన్నాథం, సిబ్బది కళావతి, పున్నారావు, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



పాదయాత్ర నిర్వహిస్తున్న నాయకులు

దుత్తలూరు: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ పందిటి అంబేడ్కర్, జిల్లా ఇన్‌చార్జి గొల్లపల్లి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మాదిగ సంగ్రామ పాదయాత్రలో భాగంగా నందిపాడు సెంటర్‌లో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడుతామని హామీ మోసం చేసిందన్నారు. ఏప్రిల్ 3న చేపట్టనున్న బీజేపీ జిల్లా కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు. అంతేకాకుండా ఈ నెల 27,28 తేదీల్లో మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఛలో ఢిల్లీ కార్యక్రమానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు నందిపోగు వెంగళరావు, గోచిపాతల వెంకటేశ్వర్లు, ఎంఎస్‌పీ జిల్లా మహిళా ఇన్‌చార్జి జానకి, ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు యద్దనపూడి రమణయ్య, మురళి, లక్ష్మమ్మ, సుజాత, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ఆత్మకూరు: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. పట్టణంలో నాలుగు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 237 మందికి గానూ ఆరుగురు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 222 మందికి గానూ 10 మంది, షిర్డీ సాయిరాం కళాశాలలో 258 మందికి గానూ ఆరుగురు, జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో 217 మందికి గానూ ఏడుగురు గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రాల అధికారులు తెలిపారు. కాగా విద్యార్థులు నిబంధనల మేరకు 9 గంటలలోపు పరీక్ష కేంద్రానికి హాజరుకావాలి. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అను మతి లేకపోవడంతో ఎస్సై ఎం శివశంకర్‌రావు తన సిబ్బందితో మెయిన్ బజారులో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించారు.

స్టేట్‌అబ్జర్వర్ తనిఖీలు

పట్టణంలోని నాలుగు పరీక్ష కేంద్రాలను స్టేట్‌అబ్జర్వర్ తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఓ విద్యార్థిని, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మాస్‌కాపీయింగ్ పాల్పడుతుండగా గుర్తించి కేసులు నమోదు చేశారు.

సంగం: స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 280 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 270 మంది హాజరయ్యారు.

మర్రిపాడు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 223 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 219 మంది హాజరయ్యారు. ఓ విద్యార్థి మాస్‌కాపీయింగ్ పాల్పడుతూ డీబార్ అయినట్లు ప్రిన్సిపల్ హనుమంతరావు తెలిపారు. ఎస్సై విశ్వనాథరెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు.

చేజర్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 73 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 72 మంది హాజరయ్యారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని వసతులు కల్పించినట్లు చీఫ్‌ఎగ్జామినర్ టీ శ్రీధర్ తెలిపారు.

కలిగిరి: స్థానిక ఆదర్శ పాఠశాలలో జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 8 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 122 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 114 మంది హాజరయ్యారని రైన ట్లు చీఫ్‌సూపరింటెండెంట్ ఏ శ్రీను తెలిపారు. కలిగిరి సీఐ సాంబశివరావు, ఎస్సై సూర్య ప్రకాష్‌రెడ్డి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 35 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 376 మంది పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 341 మంది హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఎం.కిరణ్ తెలిపారు.



ఆత్మకూరు: పరీక్షల తనిఖీకి వచ్చిన రాష్ట్ర పరిశీలకుడు



కలిగిరిలో విద్యార్థులను తనిఖీ చేసి లోపలకు పంపుతున్న పోలీసులు



చేజర్లలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు